క్లుప్తంగా

భూముల వివరాలు నమోదు

భామిని: మండలంలోని బిల్లుమడలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–శాశ్వత భూసర్వేలో భాగంగా ఆదివారం రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఇప్పటికే గ్రామంలో చేపట్టిన భూసర్వేలో రైతుల భూమిహక్కు పత్రాలు, ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్సులు తీసుకొని వివరాలు నమోదు చేశారు. వీఆర్‌ఓ సిర్ల జయరాజ్, వీఆర్‌ఏ నిమ్మల కర్ణ, సహాయ సర్వేయర్లు భూముల రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: సీఐ

పాలకొండ: మైనర్లు వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తల్లిదండ్రులు మైనర్లయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సీఐ మురళీధర్ సూచించారు. వీరఘట్టం–పాలకొండ రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పిల్లలు చేసే తప్పులకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమిత వేగంతో ఆటోలు నడపాలన్నారు.

రహదారిపై చేరిన వర్షపునీరు


గుమడ వద్ద రోడ్డుపై చేరిన వర్షపునీరు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు మార్గంలో పలుచోట్ల రహదారి అధ్వానంగా తయారైంది. గత ఏడాది ప్రభుత్వ నిధులతో రహదారితో ఉన్న గోతులను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తి పడి నాశిరకంగా పనులు చేపట్టడంతో ఇటీవల కురిసన వర్షాలకు రోడ్డుపై గోదులు ఏర్పడ్డాయి. అంత రాష్ట్ర రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఆ గోతులు పెద్దవై ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్డుపై చేరిన వర్షపు నీటిని తొలగించి గోతులు పూడ్చాలని, అలాగే నాశిరకంగా మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వరలక్ష్మి

కురుపాం: పాముకాటుకు గురై ఓ మహిళ ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలోని జి.శివడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కె.వరలక్ష్మి ఇంటి పెరట్లో పనిచేస్తుండగా ఆమె ఎడమ చేతిపై పాము కాటేసింది. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు మొండెంఖల్లు పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సీహెచ్‌సీకి రిఫర్ చేశారు.

భాగవత సప్తాహం


భాగవత సప్తాహంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి (శృంగార వల్లభస్వామి) దేవస్థానంలో భాగవత సప్తాహ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. విశ్రాంతి తెలుగు పండిట్ పి.సింహాచలం బమ్మెర పోతన రాసిన శ్రీమదాంధ్ర మహాభాగవతంలోని అంశాలను పారాయణం చేశారు. లోక కళ్యాణం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.లక్ష్మినగేష్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు ద్వారపురెడ్డి ధనంజయరావు, జట్టు ట్రస్ట్ అధినేత డొల్లు పారినాయుడు, ఆవాల కన్నయ్య, శ్రీరామచంద్రమూర్తి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పాడిపశువుల పెంపకానికి

పశు విజ్ఞాన బడి


తుమరాడలో జీవాలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

- ఆర్‌బీకేల్లో ప్రతీ బుధవారం అవగాహన తరగతులు
- పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం

పాడి రైతులు, గొర్రెలు, మేకల వివరాలు

మండలం	పాడిరైతులు	గొర్రెలు, మేకలు
పాలకొండ	1,275	31,656
వీరఘట్టం	856	37,458
సీతంపేట	640	11,954
భామిని	715	12,854

పాలకొండ రూరల్: వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పాడిరైతులకు అనేక రాయితీలు అందిస్తోంది. 'పొలం బడి' మాదిరిగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతీ నెలా 'పశువిజ్ఞాన బడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పాడిరైతులకు పశుపోషణ, సంరక్షణపై పశుసంవర్ధకశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గొర్రెలు, మేకల సంరక్షణ దినోత్సవం పేరుతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు.

పాడి అభివృద్ధే లక్ష్యంగా..

గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను వేదికగా చేసుకుని పాడి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించింది. మండలాల్లో విధులు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు వారి పరిధిలోని 20 మంది పాడిరైతులను ఎంపిక చేసుకొని, వారికి పశుపోషణ, చూడి పశువుల సంరక్షణ, పశుగ్రాసాల సేద్యం, దాణా తయారీ, అజొల్లా పెంపకం, పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలు, ఇతర ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా పశువిజ్ఞాన తరగతులు నిర్వహిస్తారు. ఆర్‌బీకేల్లో ఉన్న టీవీల్లో ప్రతీ బుధవారం పాడి అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలను అందిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పశువుల్లో వ్యాపించే సాధారణ, సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు.

ప్రతీ నెల సంరక్షణ దినోత్సవం..

పశుపోషణ అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో గొర్రెలు, మేకల సంరక్షణ దినోత్సవాన్ని ప్రతీ నెల నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ప్రతీ మండలంలో అత్యధికంగా గొర్రెలు, మేకలు ఉన్న గ్రామాలను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేసుకుని 20 మంది పెంపకందారులతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ తరహా జీవాలకు సీజన్‌లో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. అలాగే పెంపకందారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తదితర వాటిపై చైతన్యం కల్పిస్తారు.


అన్నవరంలో గ్రాస్‌కట్టర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎంతో ప్రయోజనం



పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ తరహా కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరం. గతంలో కేవలం అవగాహన కార్యక్రమాలు మాత్రమే నిర్వహించేవారు. ఇప్పుడు అవగాహనతో పాటు వారు నేర్చుకున్న అంశాలను ఆచరించే విధంగా పశువిజ్ఞాన బడులు, గొర్రెలు, మేకల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో పాడితో పాటు గొర్రెలు, మేకల పెంపకందారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే జీవాలకు అవసరమైన టీకాలు, నట్టల మందుల వినియోగం, వాటి ఆవశ్యకతను వివరిస్తున్నాం.

– బి.సిద్ధార్థ, పశు వైద్యాధికారి, పాలకొండ

నూతన కార్యవర్గం ఏర్పాటు

భామిని: మండలంలో బాలేరు అయ్యప్పస్వామి మందిరం సన్నిధానంలో ఆదివారం మండల విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆగూరు సంజీవస్వామి ఆచారి, ఉపాధ్యక్షుడిగా రీసి శంకరరావు ఆచారి, కోశాధికారిగా సింహాద్రి రమేష్ ఆచారి, ప్రధాన కార్యదర్శిగా కొర్లాపు లక్ష్మణరావు ఆచారిలను ఎన్నుకున్నారు.


విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం

పండుటాకులకు తీరిన పింఛన్ పాట్లు


టీడీపీ హయాంలో పింఛన్ల కోసం వీరఘట్టం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

వీరఘట్టం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ వ్యవస్థతో పింఛన్ కోసం అవ్వాతాతలు పడే కష్టాలు తీరిపోయాయి. ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తుండడంతో వారి ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోంది.

టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పనులు మానుకుని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, రచ్చబండ, రామమందిరాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. కానీ నేడు వలంటీర్లు ఒకటో తేదీ ఉదయం కోడికూయక ముందే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తుండడంతో వృద్ధులు, దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వలంటీర్లపై జనసేన, టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదని అంటున్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దే వలంటీర్ నుంచి పింఛను అందుకుంటున్న వృద్ధురాలు

మీనామృతంతో చీడపీడలకు చెక్

గరుగుబిల్లి: పంటలను ఆశించే చీడపీడల నివారణకు మీనామృతంతో చెక్ పెట్టొచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ పోలినాయుడు అన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తున్న చిలకాం, నందివానివలస, దళైవలస గ్రామాల రైతులకు మీనామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. 3 కిలోల చేపల వ్యర్థాలు, నల్ల బెల్లాన్ని ఒక తొట్టెలో తీసుకుని 15 రోజులు మరగబెట్టాలి. అలా వచ్చిన కషాయాన్ని ఎకరాకు రెండుమార్లు పిచికారీ చేసుకోవడం ద్వారా తెగుళ్ల వ్యాప్తి, ఉధృతిని నివారించవచ్చని సూచించారు.


మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నేడు వాహనాల వేలం

కురుపాం: సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సోమవారం వేలం వేయనున్నట్లు పోలీసులు తెలిపారు. వేలంలో మూడు ద్విచక్ర వాహనాలు, ఒక మినీ వ్యాన్, ఒక జీపు ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు గజాలఖానా సమీపంలో భూసర్వే

పాలకొండ రూరల్: భూముల సమగ్ర రీసర్వేలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు వీరఘట్టం రహదారిలో గజాలఖానా వంతెన దిగువన ఉన్న భూములు, తోటలను సర్వే చేయనున్నట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో భూములు, తోటలు ఉన్న రైతులు, హక్కుదారులు పట్టాదారు పాసుపుస్తకాలు పట్టుకుని పొలం వద్దకు చేరుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు.

రైతు సంఘం నాయకుల వినతి

పాలకొండ: ఖరీఫ్‌లో ధాన్యం రవాణా చార్జీలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రైతు సంఘం నాయకులు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఫిర్యాదు చేశారు. రైతులు తమ సొంత ఖర్చులతో ధాన్యం రవాణా చేయగా.. దళారీలు రవాణా చార్జీలు దోసుకున్నారని రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆరోపించారు. దీనిపై వివరాలు అందించేందుకు సివిల్ సప్లై అధికారులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు.

శిలాఫలకానికే పరిమితమైన టీడీపీ హామీ


కళింగవైశ్య సామాజిక భవన నిర్మాణానికి కళా వేసిన శిలాఫలకం

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికల్లో కళింగ వైశ్యుల ఓట్లు కోసం టీడీపీ ఆడిన డ్రామాకు స్థానిక అగ్రహారం వీధిలో ఉన్న శిలాఫలకమే సజీవ సాక్ష్యం. వీరఘట్టంలో 331 కళింగ వైశ్య కుటుంబాల్లో సుమారు 1100 మంది ఓటర్లు ఉన్నారు. వారిని ఆకట్టుకునేందుకు సామాజిక భవనాన్ని నిర్మిస్తామని టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2018 జూన్ 17న అప్పటి రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి కళా వెంకటరావు రూ.15 లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. కానీ నిధులు కేటాయించకపోవడంతో భవనం కోసం ఎదురు చూసిన కళింగ వైశ్యులకు నిరాశే మిగిలింది. అయితే ఇటీవల భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ టీడీపీ నేతలు చేపట్టిన బస్సుయాత్ర వీరఘట్టం వచ్చిన కళా వెంకటరావు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై స్థానికులు మండిపడ్డారు. కళింగవైశ్య సామాజిక భవనం కట్టిస్తామని చెప్పి శిలాఫలకంతో సరిపెట్టిన మాజీ మంత్రి ఏ మొహం పెట్టుకుని ఈ ప్రాంతానికి వచ్చారని పలువురు ప్రశ్నించారు.

ప్రతిపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదు


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు

వీరఘట్టం: నోరుందికదా అని జనసేన, టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు అన్నారు. స్థానిక పీఏసీఎస్ వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. ఆయన పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు నేరుగా ప్రజలకు చేరువ చేస్తూ తమ సేవలతో ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. ఈ విషయాలను జీర్ణించుకోలేక టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు ప్రభుత్వం, వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు రాజకీయాలు ఎంతో హుందాగా ఉండేవని, ఇప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తాయని, కానీ మన రాష్ట్రంలో మాత్రం ప్రజా సంక్షేమాన్ని అడ్డుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులతో పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇటువంటి ప్రతిపక్షాలు ఏమీ చేయలేవన్నారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన నాయకులు వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుని, వారికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అన్నదానానికి రూ.50 వేలు వితరణ

పాలకొండ రూరల్: సత్యసాయి మందిరంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన యర్రా అన్నపూర్ణమ్మ రూ.50 వేలు వితరణ చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సేవా సమితి కన్వీనర్ ఆర్.కిషోర్‌కు ఆదివారం అందజేశారు. పేదకు అన్నం పెట్టే ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఎస్‌వీ రమణ, సుధాకర్, తదితరులున్నారు.


సేవాసమితి సభ్యులకు చెక్కును అందిస్తున్న అన్నపూర్ణమ్మ

మంత్రి ధర్మాన దృష్టికి భామిని సమస్యలు

భామిని: రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావును భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల్లో కొంతమందికి ప్రభుత్వం ప్రకటించిన అదనపు పరిహారం అందలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల మిగులు భూములకు సాగునీరు అందించాలని, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ సోమరాజు గోపాలరావు, పోతల చంద్రభూషణ ఉన్నారు.


మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

బీజామృతంతో విత్తనశుద్ధి

భామిని: విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకున్నట్లయితే పంటను ఆశించే తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది వివరించారు. మండలంలోని నులకజోడులో ఆదివారం బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు నాటే ముందు బీజామృతంతో పూర్తిగా తడిపి 24 గంటల పాటు ఆరబెట్టుకోవాలని సూచించారు. 5 కిలోల ఆవుపేడను 20 లీటర్ల నీటిలో కలిపి దానికి 5 లీటర్ల ఆవుమూత్రం, కిలో పుట్టమట్టి కలపాలి. 12 గంటల తరువాత ఆ ద్రావణానికి 50 గ్రాముల సున్నం కలిపి విత్తనాలు శుద్ధికి వినియోగించుకోవాలని ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది వివరించారు.


బీజామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

ఎమ్మెల్యే పరామర్శ


నారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని నీలమాంబపురం గ్రామానికి చెందిన మర్రాపు నారాయణమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం పరామర్శించారు. నారాయణమ్మ మృతికి గల కారణాలను ఆమె కుమారుడు, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేష్‌ను అడిగి తెలుసుకుని సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గిరిజన సంఘాల సమావేశం

గుమ్మలక్ష్మీపురం: ఆగస్టు 9న ఏటా జరుపుకునే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా జరుపుకుందామని గిరిజన సంఘాల నాయకులు కోలక లక్ష్మణమూర్తి, ఎన్.కృష్ణబాబు, మండంగి రమణ, కోలక అవినాష్, కె.మల్లేశ్వరరావు, లోవరాజు తదితరులు పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఆదివారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గిరిజన సంఘాల నాయకులంతా పాల్గొని ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గిరిజనులంతా గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించే ఉత్సవంలో పాల్గొనాలని వారంతా కోరారు. సమావేశంలో ఇంటికుప్పల రామకృష్ణ, పువ్వల సత్యనారాయణ,. ధర్మారావు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన వివిధ గిరిజన సంఘాల నాయకులు

మణిపూర్ మహిళలకు మద్దతుగా..


సీతంపేట: పూతికవలసలో నిరసన తెలియజేస్తున్న ఆదివాసీ మహిళలు


పాలకొండ: కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ చేస్తున్న దళిత సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం/పాలకొండ/సీతంపేట: మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పలు గిరిజన, దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మహిళలపై దాడులను ఖండిస్తూ ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గుమ్మలక్ష్మీపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఐ.రామకృష్ణ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వై.సూర్యనారాయణ, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తాడంగి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పాలకొండ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘ నాయకులు బత్తిన మోహనరావు, గురుబిల్లి రవికుమార్, పాట్నూరు రమేష్ తదితరుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లు అర్పించారు. సీతంపేట మండలం పూతికవలసలో గిరిజన సంఘం నాయకుడు లక్ష్మణరావు, ఆదివాసీ మహిళలు నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కలుగజేసుకుని మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషిచేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


గుమ్మలక్ష్మీపురం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న గిరిజన, ప్రజా సంఘాల నాయకులు